# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అనుమతులను త్వరగా మంజూరు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- చట్టసభలకు హాజరుకాని ప్రజాప్రతినిధులకు పని లేకపోతే జీతం లేదు విధానాన్ని అమలు చేయాలని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు కోరారు.
- మాతా, శిశు మరణాల్ని తగ్గించేందుకు సమగ్రమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.
- సముద్రపు నాచు సాగు మత్స్యకార మహిళలకు ఆదాయవనరుగా దోహదపడుతుందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్ అన్నారు.

=================

రాష్ట్రంలో పరిశ్రమలకు వేగంగా అనుమతులివ్వడంతో పాటు.. ఉత్పత్తి వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి ఈరోజు జాతీయ, అంతర్జాతీయ పాత్రికేయులతో మాట్లాడారు. పారిశ్రామికవేత్తలతో స్నేహ పూర్వకమైన విధానం అనుసరిస్తున్నామని చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా పరిశ్రమలకు అవసరమైన అనుమతులను త్వరితగతిన ఇస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు ఎస్క్రో ఖాతా ద్వారా ప్రోత్సాహకాలిచ్చే విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అగ్రిటెక్ విధానాన్ని అమలు చేస్తున్నామని చంద్రబాబు నాయుడు చెప్పారు. సాంకేతికత వినియోగంతో వ్యవసాయంలో పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

=================

చట్టసభలకు హాజరుకాని ప్రజాప్రతినిధులకు.. పని లేకపోతే జీతం లేదు నిబంధనను వర్తింపజేయాలని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు కోరారు. ఒకవేళ అప్పటికీ తీరు మార్చుకోకపోతే.. ప్రజలే వారిని వెనక్కి పిలిపించేలా "రైట్ టు రీకాల్" హక్కును కల్పించాలన్నారు. ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న చట్ట సభల సభాపతుల 86వ అఖిల భారత మహాసభలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా "ప్రజలపట్ల శాసనవ్యవస్థ జవాబుదారీతనం" అనే అంశంపై అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికైన కొంత మంది సభ్యులు ఒక్క రోజు కూడా సభకు హాజరు కాలేదన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

=================

రాష్ట్రంలో మాతా, శిశు మరణాలను తగ్గించేందుకు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇందులో భాగంగా పుట్టిన ఏడాది లోపు శిశు మరణాలకు దారితీస్తున్న కారణాలు, వైద్యులు, సిబ్బంది అనుసరిస్తున్న విధానాలను గుర్తించడం జరుగుతోందన్నారు. దీని కోసం జిల్లాల వారీగా ముగ్గురు వైద్యులతో పరిశీలన బృందాలను ఏర్పాటు చేసినట్లు ఈ రోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో శిశువులలో ప్రతి వెయ్యి మందిలో 19 మంది ప్రాణాలు కోల్పోతున్నారని మంత్రి చెప్పారు. వీటి పైన కూడా రాష్ట్రంలో అధ్యయనం చేస్తామని చెప్పారు. యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సహకారంతో రాష్ట్రం మాతా శిశు మరణాలను తగ్గించే విధంగా చర్యలు తీసుకుంటామని సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

=================

సముద్రపు నాచు సాగు మత్స్యకార మహిళలకు ఆదాయవనరుగా దోహదపడుతుందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్ అన్నారు. భీమునిపట్నంలోని మంగమారిపేట సముద్ర ప్రాంతంలో మత్స్యకార మహిళల కోసం ప్రభుత్వం తలపెట్టిన సముద్రపు నాచు సాగు కార్యక్రమాన్ని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సామూహిక విధానంలో సముద్రపు నాచు సాగు చేపట్టగలిగితే లాభసాటిగా ఉంటుందన్నారు. తక్కువ పెట్టుబడితో స్థిరమైన ఆదాయం సంపాదించేందుకు ఇది అనువైన విధానమన్నారు.

=================

దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా మూడవ రోజు అయిన ఈ రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమారా లీజర్ సంస్థ సీఈఓ సృష్టి శిబులాల్ తో సమావేశం అయ్యారు. ఆంధ్రప్రదేశ్ లో ఆతిధ్య రంగంలో పెట్టుబడులపై ముఖ్యమంత్రి తమారా సంస్థ ప్రతినిధులతో ఈ సందర్భంగా చర్చించారు. ఈ రంగానికి సంబంధించిన రాష్ట్రంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి వారికి తెలిపారు. పర్యాటకాన్ని ప్రోత్సహించేలా ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా ఇచ్చామని చంద్రబాబు నాయుడు వివరించారు.

విరామం

=================

విశాఖ వేదికగా ఫిబ్రవరి 17 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) -2026 జరగనుంది. ఈ ఫ్లీట్ రివ్యూకి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరు కానున్నారు. రాష్ట్రపతి పర్యటనను జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను కోరారు. పోలీసు, రక్షణ శాఖ అధికారులతో స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో కలెక్టర్ ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఐఎఫ్ఆర్-2026, మిలాన్ విలేజ్ కార్యక్రమాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అధికారులు పని చేయాలని సూచించారు. రాష్ట్రపతి పర్యటనను అత్యంత భద్రతతో.. ప్రోటోకాల్‌కు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు.

=================

ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుంటూ.. గిరిజన రైతులు ఆర్థికంగా ఎదగాలని సెంట్రల్ నోడల్ ఆఫీసర్ అమిత్ సింగ్లా ఆకాంక్షించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లంబసింగి, తాజంగి, రాజుపాకల ప్రాంతాలలో ఆయన ఈ రోజు పర్యటించి.. పలు అభివృద్ధి పనులను, సాగు క్షేత్రాలను పరిశీలించారు. ముందుగా లంబసింగిలో పర్యటించిన ఆయన.. అక్కడ సాగవుతున్న స్ట్రాబెర్రీ తోటలను సందర్శించారు. పంట పెట్టుబడి, మార్కెటింగ్ సౌకర్యాలు, రైతులకు వస్తున్న దిగుబడి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తాజంగి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ రబీ సీజన్‌లో నూతనంగా 700 ఎకరాల్లో సాగు చేస్తున్న వేరుశనగ పంటను సందర్శించారు.

=================

జపాన్ కు చెందిన ప్రముఖ రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ జెరా (JERA) గ్లోబల్ సీఈవో యుకియో కానితో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ దావోస్ లో ఈ రోజు సమావేశం అయ్యారు. జపాన్, ఇతర ఆసియా మార్కెట్లకు లో-కార్బన్ అమ్మోనియాను సరఫరా చేయడానికి ఆంధ్రప్రదేశ్ లోని మూలపేట, కృష్ణపట్నం, కాకినాడ పోర్టుల్లోని మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వివరించారు.

=================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 23వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=================

రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ద్వారా రైతుల భూ హక్కులను కాపాడుతున్నామని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అన్నారు. కాట్రేనికోన మండల పరిధిలోని దొంతికుర్రు గ్రామంలో పట్టాల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ ఈ రోజు పాల్గొన్నారు. రీసర్వే ద్వారా తప్పులను సరిచేసి పాస్ పుస్తకాలను గ్రామసభలలో రైతులకు ఉచితంగా ఇస్తామని తెలిపారు.

=================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అందే ప్రతి అర్జీ పరిష్కారం కావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో అర్జీదారుల సంతృప్తి కొలమానంగా అధికారులు పని చేయాలని కలెక్టర్ ఉద్ఘాటించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మక్కువ ఎంపీడీఓ కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్. వైశాలిలతో కలిసి ప్రజల నుంచి 83 వినతులను స్వీకరించారు.

=================

=================